క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్టోత్సవాలు

సంజామల: మండల పరిధిలోని ముచ్చలపురి గ్రామంలో గణపతి, గౌరీదేవి, నాగదేవత, రాములమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ట ఉత్స వాల్లో భాగంగా బుధవారం రెండవ రోజు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం ప్రాతఃకాల పూజ, మూల మంత్ర జపాదులు, యంత్రాలకు, ప్రతిష్టా మూర్తులకు అభిషేకం, రుద్రహోమాలు, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం ప్రదోశకాల పూజలు, మూలమంత్ర జపాదులు చేసి ప్రతిష్టామూర్తులకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా గ్రామోత్సవం చేశారు. అనంతరం ధాన్య, శయ్య, పుష్ప ఫల అధివాసములు, హోమాలు చేసి మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కోవెలకుంట్ల: రాష్ట్రంలోని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల (వీఆర్ఏలు)కు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరు సత్యరాజు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కోవెలకుంట్లలో విలేకరులతో మా ట్లాడుతూ.. వీఆర్ఏలకు తహసీల్దార్ కార్యాలయాల్లో అక్రమ డ్యూటీలు వేసి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. వీఆర్ఏలకు పే స్కేల్ సదుపాయం కల్పించి 60 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. బ్రిటీష్ కాలం నుంచి రూ. 3 వేతనంతో ప్రస్తుతం నెలకు రూ.10,500 వేతనం తీసుకుంటూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వీఆర్ఏలు విధులు నిర్వర్తిస్తున్నార న్నారు. వయోభారంతో ఇబ్బంది పడుతున్న వీఆర్ఏల స్థాన ంలో వారి వారసులకు ఉద్యోగఅవకాశం కల్పి ంచాలన్నారు. ప్రస్తుతం వీఆర్ఏలకు అందుతున్న వేతనం కుటుంబ పోషణకు ఎంత మా త్రం సరిపోవడం లేదని, నెలకు రూ.25 వేలు వేతనం అందించి ఆదుకోవాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: బనగానపల్లె ఎక్సైజ్ శాఖ పరిధిలో 45 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వర్ధనా దేవి బుధవారం తెలిపారు. పలు చోట్ల నాటుసారా అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన అరగొండ లక్ష్మిదేవిని అదుపులోకి తీసుకొని ఆమె వద్ద 40 లీటర్ల నాటుసారా, అలాగే బనగానపల్లె మండలం బీరవోలు గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మిదేవిని అదుపులోకి తీసుకొని ఆమె వద్ద 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం వారిని బనగానపల్లె కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం ఆర్టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి పన్నులు చెల్లించకుండా, అలా గే అధిక లోడ్ వేసుకొని వెళుతున్న వాహనదారులకు జరిమానా విధించామన్నారు. మొత్తం రూ.5,38,800 జరిమానా విధించినట్లు చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ఎలాంటి అనుమతులు లేకు ండా వాహనాలు నడిపితే భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. తనిఖీలో ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశు దాణాను సద్వినియోగం చేసుకోండి



పశు దాణా పంపిణీ చేస్తున్న డాక్టర్ మారుతి

అవుకు: సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న పశు దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మారుతీ సకారం సూచించారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పాడి రైతులకు పశువుల దాణాను బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి సంపదను పెంపొందించేందుకు 50 కేజీల సమీకృత పశు దాణా కిట్టు రూ.555కే రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. అవుకు, గుండ్లశింగవరం పశు వైద్యశాలలకు 120 బ్యాగుల దాణా మంజూరైనట్లు చెప్పారు. అనంతరం పశువైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. పశువైద్యాధికారిణి భారతీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

డోన్ టౌన్: మధ్యాహ్నం భోజన నిర్వాహకులు విద్యార్థులకు శుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారులు ప్రభాకర్, రామనర్సప్ప సూచించారు. త్వరలో పాఠశాలలు ప్రారంభం కానుండటంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

- నమ్మించి నట్టేట ముంచడం ఆయన నైజం
- సూపర్‌సిక్స్ పేరుతో పీఠమెక్కి ప్రజలకు మళ్లీ వెన్నుపోటు
- ఏడాది పాలన గడిచినా పథకాలు లేవు
- అవినీతి, అక్రమాలు, తప్పుడు కేసులతో పబ్బం
- మాజీ మంత్రి బుగ్గన విమర్శలు





ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్యకర్తలు



డోన్ పాత బస్టాండ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



డోన్‌లో వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొన్న అశేష ప్రజానీకం

డోన్: నమ్మించి నట్టేట ముంచడం, ఆదరించిన వారినే వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబు నైజమని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. కూటమి పార్టీల నాయకులు అలవిగాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేజిక్కించుకొని ఏడాది పాలన గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మాజీ మంత్రి బుగ్గన ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుగ్గన స్వగృహం నుంచి కంబాలపాడు సర్కిల్ పాతబస్టాండ్ వరకు పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో బుగ్గన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల జిల్లా డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విధ్వంసకరంగా మార్చిందని ఆరోపించారు. టీడీపీ నాయకులు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు.

అవినీతి, అక్రమ కేసులతో పబ్బం

రాష్ట్రంలో అమరావతి, వైజాగ్ లాంటి పట్టణాల్లో కారుచౌకగా ప్రభుత్వ భూములను తమకు అనుకూలమైన వారికి కట్టబెట్టి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందన్నారు. అక్రమ మద్యం, ఇసుక వ్యాపారాలు చేస్తూ కోట్లాది రూపాయలను ఆ పార్టీ నాయకులు అక్రమంగా ఆర్జిస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించడం, పోలీసుల చేత అకారణంగా చితకబాదిస్తూ రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని నెలకొల్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ రంగనాయకులుకు వినతి పత్రం అందజేశారు.

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

డోన్‌ను కర్నూలు జిల్లాలో కలుపుతామని, ప్యాపిలి మండలం జలదుర్గంను మండల కేంద్రంగా మారుస్తామని, ప్రతి కుటుంబానికి 3 సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న టీడీపీ నాయకులు ఇప్పుడు వాటి గురించే మాట్లాడటం లేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేశారని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని తిరిగి మూయించేలా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు తామే చేశామనేలా ప్రజల్లో భ్రమలు కలిగించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తుండటం శోచనీయమన్నారు. తాము భూమిపూజ, శంకుస్థాపనలు చేసిన ప్రారంభించిన చిన్నతరహా పరిశ్రమల యూనిట్లు, చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణాన్ని తామే చేశామని చెప్పుకుంటూ మళ్లీ ప్రారంభించడం ఎంతవరకు నైతికత అని ప్రశ్నించారు. కుట్ర పూరిత రాజకీయాలు తప్పా టీడీపీ నాయకులు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని మండిపడ్డారు.

ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

ర్యాలీ సభలో పాల్గొన్న ప్రజల్లో ఏఒక్కరిని అడిగినా కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఏకరువు పెట్టారు. ప్రజలను వంచించి అధికారం చేజిక్కించుకోవడం చంద్రబాబుకు అలవాటేనని పలువురు వ్యాఖ్యానించారు. రైతాంగంతో పాటు మహిళలను మాయ మాటలతో మభ్యపెట్టడం, 50 ఏళ్లు నిండిన బీసీలందరికీ పెన్షన్లు అందజేస్తానని ఆశచూపి వారి ఆశలను అడియాసలు చేశారని మండిపడ్డారు. అబద్ధాలు ఆడటం, ప్రజలను మోసగించడం చంద్రబాబుకు అలవాటేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, ఎంపీపీలు గోకుల్ లక్ష్మి, రేగటి రాజశేఖర్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, జెడ్పీటీసీలు బద్దల రాజ్‌కుమార్, శివలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, నాయకులు పోస్టుప్రసాద్, కురుకుంద హరి, బోరెడ్డి పుల్లారెడ్డి, మల్లెంపల్లె రామచంద్రుడు, బోరా మల్లికార్జునరెడ్డి, గడ్డం భువనేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఓబులాపురం మదన్,సుధాకర్ యాదవ్, క్రిష్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుంకయ్య, చంద్రశేఖర్ రెడ్డి, నాగభూషణంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామ్మూర్తి, చంద్రయ్య, రామాంజనేయులు, పిట్టల జాకీర్, మురళీకృష్ణ, తిరుమలేశ్వరరెడ్డి, మూర్తుజావలి, సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెట్టించిన ఉత్సాహం

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి కావడంతో వైఫల్యాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ప్రజాపోరాటంలో ఆ పార్టీ కార్యకర్తలు, ప్రజలు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నారు. వందలాది మంది చిన్నారులు సైతం ఎంతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొనడం విశేషం. '420 రా బాబు .. మళ్లీ పొడిచాడు రా బాబు', 'సొంత డబ్బా.. పర డబ్బా.. పరస్పర డబ్బా, ఏడాదంతా అబ్బాకొడుకుల డబ్బా', 'ఉచిత ఇసుక భూటకం, దోపిడీ ముమ్మాటికి నిజం' లాంటి నినాదాలు రాసిన ప్లకార్డులు జనాన్ని ఆలోచింపజేశాయి.



బనగానపల్లెలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

రాష్ట్రంలో విధ్వంసకర పాలన

- మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం
- బాబు పాలనంతా డాబే

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన గడిచినా సూపర్ సిక్స్ పథకాలతో పాటు, 143 హామీల్లో ఏ ఒక్కటి నేరవేర్చకపోవడంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకులు పోచా శీలారెడ్డి, గుండం సూర్యప్రకాష్ రెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, చిన్నబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి మరికొందరు జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు సర్పంచ్ ఎంపీటీసీలు, కార్యకర్తలు వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వారంతా ఉదయం 10 గంటలకు కాటసాని రామిరెడ్డి స్వగృహం వద్దకు చేరుకున్నారు. అక్కడినుంచి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్లకార్డులను ప్రదర్శిస్తూ భారీ ర్యాలీగా పోలీసుస్టేషన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంపద సృష్టించి పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, ఇప్పుడు సంపదంతా కూటమి నాయకుల బీరువాల్లోకి వెళ్లగా రాష్ట్రానికి, ప్రజలకు అప్పులు మిగిలాయన్నారు. ఏడాది పాలనలో 1,52,604 కోట్ల అప్పులు చేశారని, ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేక పోయారని ధ్వజమెత్తారు. హామీల అమలుపై ప్రభుత్వ మెడలు వంచేందుకు ప్రజల తరఫున పోరాటలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రశ్నించిన వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో కూటమి నాయకులు 100–150 మంది ఉపాధి కూలీల వేతనాలను కాజేస్తున్నారని, దీనిపై ఎంపీడీఓ కార్యాలయాల వద్ద పోరాటలు చేస్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బనగానపల్లెలో వంద పడకల వైద్యశాల ఏర్పాటుచేయగా నేడు మందులు లేవన్నారు.

మంత్రి బీసీ అక్రమాలు

జిల్లాలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అక్రమాలను నారా లోకేష్ గుర్తించాలని, నియోజకవర్గంలో పలువురు బీసీజేఆర్ ట్యాక్స్ కడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. బీసీ మంత్రి పదవి కోసం రూ.150 కోట్లు ఇచ్చారని, మరో వంద కోట్లు ఇవ్వాలని అందుకే డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆయనే చెప్పుకుంటున్నారన్నారు. స్థానిక కంకర ఫ్యాక్టరీ యజమానుల నుంచి భారీ మొత్తం వసూలు చేశారని, ఫంక్షన్ హాల్ యజమాని గాధంశెట్టి వేణుగోపాల్ నుంచి రూ.1.2 కోట్లు, బెల్లం శ్రీనివాసులరెడ్డి నుంచి రూ.50 లక్షలు, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్ నుంచి రూ.80 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపించారు. ప్రతి పొగాకు బేడు నుంచి రూ.రెండు వేలు వసూలు చేయడంతో కంపెనీల నుంచి రైతులకు గిట్టుబాటు ధర లభించకపోగా, కంపెనీలు పారిపోయే పరిస్థితి నెలకొందన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి మాముళ్లు వసూలు చేస్తున్నారని, మంత్రి అక్రమ వసూళ్లపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వాస్తవం అని నిర్ధారణ అయితే మంత్రి పదవీ నుంచి భర్తరఫ్ చేసే ధైర్యం మంత్రి లోకేష్‌కు ఉందా అన్ని ప్రశ్నించారు.

ఏడాదిగా చీకటి పాలన: ఎర్రబోతుల పాపిరెడ్డి జెడ్పీ చైర్మన్

ఏడాది కాలంగా రాష్ట్రంలో చీకటి పాలన నెలకొందని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని, ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నేరవేర్చలేదని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను అమలుపరుస్తామన్న బాబు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, అత్తార్‌జాహెద్, అబ్దుల్‌ఖైర్, అనిల్, కునుకుంట్ల రామన్న, కృష్ణమూర్తి, కార్తీక్, జక్కా మధు, జి.రామాంజనేయులు, కర్నేష్, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళిమోహన్‌రెడ్డి, రమణ, సుబ్బారెడ్డి, కోడూరు రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఈశ్వర్, పాపన్న, వీరారెడ్డి, బీమురెడ్డి ప్రతాప్‌రెడ్డి, ముక్కమళ్ల పుల్లారెడ్డి, అంబటి గుర్విరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







రామాపురం నుంచి వెన్నుపోటు కార్యక్రమానికి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఆకుమల్ల నుంచి పయనమైన కార్యకర్తలు, కోవెలకుంట్ల నుంచి బయలుదేరిన కార్యకర్తలు, ర్యాలీకి తరలివెళుతున్న జోలదరాశి నాయకులు, బేతంచెర్ల నుంచి నల్ల కండువాలతో పయనమైన నాయకులు


పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లెరూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ నారాయణరెడ్డికి అందజేశారు. సీపీఐ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, మండల కార్యదర్శి కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల్లో జాప్యం



ఎస్సీ కాలనీలో మురుగు ప్రవహించేందుకు తీసిన కాల్వ

కొలిమిగుండ్ల: మండల పరిధిలో అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీ మీదుగా నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. గ్రామం నుంచి వచ్చే మురుగు నీరు ప్రవహించేందుకు ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో కాల్వ తీశారు. ఆ మురుగు నీరంతా సమీపంలో వృథాగా ఉన్న నాపరాతి గనుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అయితే నాలుగు నెలలు దాటినా డ్రైనేజీ పనులు చేపట్టకపోవడంతో ఎస్సీ కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం నడిచే దారిలో తాత్కాలికంగా కాల్వ తీయడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే మురుగు నీరంతా కాలనీలోకి చేరుతుందని ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీ పనులు చేపట్టకపోతే కాలనీకి వెళ్లే దారిలో తీసిన కాల్వను పూడ్చివేయాలని కాలనీవాసులు కోరారు.

ప్రధాన రోడ్డుపైకి మురుగు నీరు



ముదిగేడు గ్రామ సచివాలయం వద్ద ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో ప్రధాన రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.గ్రామంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే వృథా నీరు కోవెలకుంట్ల–అవుకు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. మురుగు నీరు సచివాలయం ముందే పారుతున్నా సమస్య కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతి రోజు నీరు ప్రవహిస్తుండటంతో పాచి పేరుకుపోయింది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ముదిగేడు గ్రామంలో సమస్యల జాతర కనబడుతుంటే పంచాయతీ కార్యదర్శి ఉన్నాడా? లేడా? అన్నట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

రైల్వే క్రాసింగ్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు సూచనలు చేస్తున్న రైల్వే అధికారులు

డోన్ టౌన్: రైల్వే క్రాసింగ్‌ల (గేట్లు) వద్ద అప్రమత్తంగా ఉండాలని, తొందరపాటు పనికిరాదని రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పట్టణంలోని రైల్వే గేట్ల వద్ద ప్రజలకు రైలు పట్టాలు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైలు స్పీడును బట్టి సెకన్ల వ్యవధిలోనే గేటును దాటుతుందని కావున రైలు, గూడ్స్, ట్రాలీలు వచ్చే విషయాన్ని ప్రజలు గమనించాకే పట్టాలు దాటాలన్నారు. కాపలా లేని రైల్వే గేట్లను దాటే సమయంలో వాహనాన్ని ఆపి ఇరుపక్కల రైళ్ల రాకపోకలను నిర్ధారించుకొన్న తర్వాతే దాటాలన్నారు. గేట్లు వేసిన సమయంలో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు కింద దూరి వెళ్లరాదన్నారు. ఓపికతో ఉండి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్ టౌన్: బేతంచెర్ల పరిసరాల్లో భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తూ అనారోగ్య కారణాలతో ఓ అనాథ వ్యక్తి కర్నూలు ఆసుపత్రిలో చనిపోగా సమాచారం అందుకున్న ద్రోణాచలం సేవా సమితి వారు బుధవారం కర్నూలుకు వెళ్లి మృతదేహానికి ముస్లిం సంప్రదాయ పద్ధతిలో ఖబరస్థాన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ద్రోణాచలం సేవా సైనికులు షాదిఖానా రాజా, గురుస్వామి, మస్తాన్, ఉదయ్, కిరణ్, షాదీక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు డ్రోన్ కెమెరాల అందజేత



ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాకు డ్రోన్ కెమెరాలు అందజేస్తున్న అల్ట్రాటెక్ సంస్థ ప్రతినిధులు

కొలిమిగుండ్ల: అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ తరఫున బుధవారం పోలీసు శాఖకు రూ.7 లక్షల విలువ గల నాలుగు డ్రోన్ కెమెరాలను నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాకు అందజేశారు. సామాజిక సేవలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నంద్యాల పోలీసు శాఖకు డ్రోన్ కెమెరాలు అందజేసిన అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యానికి ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా పోలీసుశాఖలో డ్రోన్ వ్యవస్థ బలోపేతం అవుతుందని ఎస్పీ తెలిపారు. ఇప్పటికే ప్రతి సబ్ డివిజన్‌లో డ్రోన్ వినియోగించే నైపుణ్యం కలిగిన పోలీసులను నియమించామన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో డ్రోన్‌లు ఉపయోగపడతాయన్నారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు, అల్ట్రాటెక్ సంస్థ ప్రతినిధులు అంజన్‌ప్రకాష్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్



ట్యాంకు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామంలో వారం రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. గ్రామంలో బోరు బావికి ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్ దెబ్బతినడంతో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వ్యవసాయ బోర్లను ఆశ్రయించి నీటిని తెచ్చుకునేవారు. దీనిపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'వ్యవసాయ బోర్లే దిక్కు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ స్పందించారు. బోరు బావికి విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



శిక్షణ ఇస్తున్న ఎంఈఓ వెంకటేశ్ నాయక్

ప్యాపిలి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని ఎంఈఓ వెంకటేష్ నాయక్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోజనం వండే ప్రదేశం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆరుబయట వంటలు వండే సమయంలో తప్పనిసరిగా మూతలు పెట్టాలన్నారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ మద్దయ్య, డీటీపీ భువనేశ్వరి, సీఆర్పీలు రామాంజనేయులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.